## క్లుప్తంగా

### బాధితులకు భరోసా



జనగామ : పట్టణంలోని సిద్దిపేట ఏరియా రోడ్డు పక్కన గుడిసె వేసుకుని వ్యాపారం చేస్తున్న పేద కుటుంబంపై అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ నాగరాజు దౌర్జన్యం చేయగా, బుధవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వారిని పరామర్శించి, ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించారు. ఎవరు వచ్చి బెదిరించినా తమకు చెప్పాలన్నారు. ఈ నెల 18న సాక్షిలో 'అధికార పార్టీ కౌన్సిలర్ దౌర్జన్యం' అనే శీర్షికన వచ్చిన కథనంతో ఆయన స్పందించారు. అనంతరం టీపీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ ఎండి అన్వర్ వద్దకు వెళ్లిన కొమ్మూరి వారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

### బోదకాలు వ్యాధిని నివారించాలి

● డబ్ల్యూహెచ్‌ఓ రాష్ట్ర కోఆర్డినేటర్ రాజేందర్‌కుమార్ సింగ్

బచ్చన్నపేట : ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బోదకాలు వ్యాధి(వాపు జబ్బు)ని నివారించాలని డబ్ల్యూహెచ్‌ఓ రాష్ట్ర కోఆర్డినేటర్ రాజేందర్‌కుమార్‌సింగ్ అన్నారు. బుధవారం స్థానిక సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన ఆస్పత్రి పరిసరాలు, గదులలో వసతులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆరు నెలల క్రితం ఇక్కడికి వచ్చినప్పుడు రెండు, మూడు బోదకాలు కేసులు ఉండేవని, ప్రస్తుతం ఏమీ లేవని చెప్పారు. వైద్యులు కూడా ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు.

### బియ్యం అందజేత



పాలకుర్తి : మండలంలోని చెన్నూరుకు చెందిన అర్కల సోమక్క అనారోగ్యంతో ఇటీవ మృతిచెందింది. కాగా, బాధిత కుటుంబ సభ్యులకు చుక్కా రామయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు మాచర్ల పుల్లయ్య, ఉపాధ్యక్షుడు చిక్కుడు రాములు బుధవారం 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. నరేష్, ఆకారపు ఉపేందర్, వీరయ్య, అంజయ్య, సంతోష్ ఉన్నారు.

### బిల్లును ఆమోదించాలి



కొడకండ్ల : వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో మాదిగ రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి ఆమోదించాలని జాతీయ మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలో మురళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో శోభన్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

### అవగాహన



కొడకండ్ల /బచ్చన్నపేట : విద్యుత్ వినియోగదారులు తమ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించడం సులభమని ఎన్పీడీసీఎల్ ఏడీ వేణుగోపాల్, కొడకండ్ల ఏఈ రాములు తెలిపారు. బుధవారం మండలకేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో ఆన్‌లైన్, మొబైల్ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే విధానంపై వినియోగదారులకు వారు అవగాహన కల్పించారు.

### బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు ప్రత్యేక పూజలు



చిల్పూరు/ తరిగొప్పుల : జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందాలంటూ దుర్గామాత వద్ద పల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, పార్టీ జిల్లా నాయకుడు కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో కాళీ మాత యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు అర్చకులు పల్లా, కడియం, దయాకర్ రావు గెలుపొందాలంటూ పూజలు చేయించారు. అలాగే పల్లా రాజేశ్వర్‌రెడ్డి లక్ష మెజారిటీతో గెలుపొందాలని కోరుతూ నవ తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల ఫోరం జిల్లా కమిటీ సభ్యులు బుధవారం మండలంలోని సోలిపూర్ నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం అమ్మవారికి ముడుపులు కట్టారు.

# మౌలిక వసతులు కల్పించాలి



నర్మెట: ఉన్నత పాఠశాలలో ర్యాంప్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకన్న



జఫర్‌గఢ్: సూరారంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రఘుచందర్

నర్మెట : పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్ మున్ననూరి వెంకన్న తెలిపారు. మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను బుధవారం తహసీల్దార్ సందర్శించి, పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఎన్నికల అధికారుల బస ఏర్పాట్లు, తాగు నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, అవసరమైన చోట దివ్యాంగుల కోసం ర్యాంప్‌ల ఏర్పాట్లు తదితర (ఏఎంఎఫ్) పనులపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సాయిబాబు, పీఆర్ ప్రతేక ఏఈ నాగభూషణం, ఏఈ గురిజాల ప్రదీప్, కారోబార్ చిర్ర వెంకట్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పోలింగ్ కేంద్రాల పరిశీలన**

జఫర్‌గఢ్ : మండలంలోని సూరారం, తమ్మడపల్లి (జి), ఓబులాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను వర్ధన్నపేట ఏసీపీ రఘుచందర్, సీఐ శ్రీనివాస్, స్థానిక ఎస్సై మహేందర్‌తో కలసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌లను పరిశీలించి, మాట్లాడారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిక

పాలకుర్తి : మండలంలోని వల్మిడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. కాగా పార్టీలో చేరిన వారికి మంత్రి దయాకర్‌రావు కండువాలు కప్పి ఆహ్వానించారు.

**అభివృద్ధి ప్రదాత దయాకర్‌రావు**

పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాతగా నిలిచిన మంత్రి దయాకర్‌రావును తిరిగి గెలిపించాలని కేయూ జేఏసీ వైస్ చైర్మన్ సుధాకర్ అన్నారు. బుధవారం పాలకుర్తిలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడారు. నియోజకవర్గంలో నీటి పారుదల, రోడ్లు, విద్యా, కళా సంస్కృతి ఇలా ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో జలగం నాగరాజు, వంగల అశోక్, జోగు కృష్ణ, పులి రవి, తోకల శోభన్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రిని ఆహ్వానిస్తున్న శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

**ఏడొద్దుల సద్దుల బతుకమ్మకు మంత్రికి ఆహ్వానం**

దేవరుప్పుల : ఊరుకు అరిష్టంగా భావించి పెద్దమడూరులో పురాతనంగా నిర్వహిస్తున్న ఏడొద్దుల సద్దుల బతుకమ్మ పర్వదినానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం పర్వతగిరిలో కలిసి ఆహ్వానం పలికారు. జిల్లా యువజన నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, గ్రామ బీఆర్ఎస్ నాయకుడు పెద్దారెడ్డి, ఎంపీటీసీ గిరి తదితరులు ఉన్నారు.

## పాలకుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి



ఝాన్సీరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాలకుర్తి టౌన్ : నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసి మంత్రి ఎర్రబెల్లికి గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజవర్గం ఇన్‌చార్జ్ హనుమండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గూడూరు, ఈరవెన్ను గ్రామాల్లో చేపట్టిన ఇంటింటికి ఆరు గ్యారంటీ పథకాల ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం గ్రామాల్లో దుర్గామాతాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ కుటుంబానికి అన్ని ఉద్యోగాలు దక్కాయని విమర్శించారు. పాలకుర్తిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు ప్రజలు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాయకులు వెంగళల్‌రావు, నిరజంన్‌రెడ్డి, హరిష్, బిర్రు సోమేశ్వర్, దేవేందర్, మహేందర్, ఆదినారాయణ, పింగిరెడ్డి సత్తిరెడ్డి, బుచ్చమ్మ, అశోక్, రవి, మహేందర్, రమేశ్, రాము, సురేష్ పాల్గొన్నారు.

## నియామకం

తరిగొప్పుల : కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్‌గా వగలబోయిన యాదగిరిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కొమ్మూరు ప్రతాప్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని కొమ్మూరి అందజేశారు. యాదగిరి మాట్లాడుతూ.. నమ్మకంతో మండల కోఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్

జఫర్‌గఢ్ : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ ఇల్లందుల బేబి శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై చర్చించారు. వ్యవసాయ శాఖ, ఆరోగ్య, ఐసీడీఎస్, పశువైద్యం, ఉపాధి హామీ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించగా గొర్రెల పంపిణీ విషయంలో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పంపిణీ ఎలా చేస్తారంటూ ఎంపీపీ, జెడ్పీటీసీ, పశు వైద్యాధికారి మౌనికను ప్రశ్నించారు. దీనిపై తమకు పూర్తి స్థాయి సమాచారాన్ని ఇవ్వాల్సిందిగా ఎంపీపీ ఆదేశించారు. కాగా ఆరోగ్య శాఖపై వైద్యులు మాట్లాడుతుండగా ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ బేబి శ్రీనివాస్ జోక్యం చేసుకోని వ్యాధుల నివారణపై గ్రామాలల్లో వెంటనే వైద్యశిబిరాలు నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎస్సై మహేందర్ మాట్లాడుతూ.. మండలంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరు సహకరించాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, తహసీల్దార్ అంజనేయులు, ఎస్సై పాటు వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# దమ్ముంటే రాజీనామా చేసి రావాలి

● కడియం శ్రీహరికి కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న సింగపురం ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్/రఘునాథపల్లి/చిల్పూరు/తరిగొప్పుల /లింగాలఘణపురం : బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుస్తాననే ధైర్యం, దమ్ముంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి రావాలి.. ఓటమి భయంతోనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడం లేదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ అసెంబ్లీ అభ్యర్థి సింగపురం ఇందిర అన్నారు. అధిష్టానం పార్టీ టికెట్ ప్రకటించాక మొదటిసారి ఘన్‌పూర్‌కు వచ్చిన ఆమెకు బుధవా రం పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. రాఘవాపూర్ నుంచి ఘన్‌పూర్ వరకు బైక్ ర్యాలీ చేపట్టా రు. స్థానిక బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జఫర్‌గఢ్ మండలంలోని సాగరం, తిడుగు గ్రామాల్లో రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు రఘునాథపల్లి మండల పరిధి గోవర్ధనగిరి దర్గాలో ఇందిర ప్రార్థనలు చేశారు. అలాగే.. చిల్పూరు మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల అనంతరం గుట్ట కింద ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో ఇందిర మాట్లాడుతూ.. పేదలకు డబుల్ బెడ్రూం, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీని ఓడించాలని కోరారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తరిగొపప్పుల మండల కోఆర్డినేటర్ వగలబోయిన యాదగిరి అన్నారు. మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ అధ్యక్షతన బుధవారం పార్టీ కార్యాలయంలో గ్రామశాఖ అధ్యక్ష, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు లింగాజీ, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, జగదీష్‌చందర్‌రెడ్డి, దూదిపాల నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కోళ్ల రవిగౌడ్, కె.లక్ష్మారెడ్డి, మంచాల ఎల్లయ్య, రఘునాథపల్లి ఎంపీపీ మేకల వరలక్ష్మీనరేందర్, భిక్షపతి, ఎల్లయ్య, సురేష్, యశ్వంతరెడ్డి, యాదవరెడ్డి, లక్ష్మారెడ్డి, దేవి తిరుపతిరెడ్డి, సాదం గట్టయ్య, లవన్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

# కడియంను భారీ మెజార్టీతో గెలిపించాలి



స్టేషన్ ఘనపూర్: మాట్లాడుతున్న కనకం రమేష్

జఫర్‌గఢ్ : బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలని జెడ్పీటీసీ ఇల్లందుల బేబి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు అన్నం బ్రహ్మారెడ్డి, తీగల కర్ణాకర్ రావు, బానోత్ రాజేష్‌నాయక్, కుల్లా మోహన్‌రావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో కడియం శ్రీహరి ఎన్నికల ప్రచార రథాన్ని బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ నాయకులు గాదెపాక అయోధ్య, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

**రాజవరంలో ప్రచార రథం ప్రారంభం**

చిల్పూరు : మండలంలోని రాజవరం గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి ఎన్నికల ప్రచార రథాన్ని పార్టీ మండల నాయకుడు మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి ప్రారంభించారు. సమావేశంలో ఎడ్ల శ్రీనివాస్, యాకూబ్, రంగు రవి, గంగారపు రాజు, వెంకటస్వామి, ఎడ్ల మహిపాల్, మల్లయ్య, యాదగిరి, రమేశ్, మోటం రాజు, కొంరయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ప్రశాంత్, రాకేశ్ పాల్గొన్నారు.

**కడియం గెలుపునకు పనిచేయాలి**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపునకు ప్రతీ కార్యకర్త పనిచేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని నష్కల్, వంగాలపల్లి, చిన్నపెండ్యాల, రాజవరం, వెంకటాద్రిపేట, చిల్పూరు, కొండాపూర్, లింగంపల్లి, శ్రీపతిపల్లి గ్రామాల్లో బుధవారం బూత్ కమిటీల సమావేశం నిర్వహంచారు. ఈసందర్భంగా పలు సూచనలు చేశారు.

**కడియం వెంటే ఎస్సీలు..**

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలోని ఎస్సీలంతా బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి వెంటే ఉన్నారని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ కనకం రమేశ్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలంతా పార్టీ అధిష్టానం, సీఎం కేసీఆర్ ఆదేశాలు శిరోధార్యంగా పనిచేస్తున్నారని, కొందరు నాయకులు ఉద్దేశ పూర్వకంగా దళితుల మధ్య వర్గాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాజయ్య సైతం బీఆర్ఎస్ పార్టీ, కడియం గెలుపు కోసం కృషి చేస్తారన్నారు. చాడ కుమార్, గడ్డమీది వెంకటస్వామి, మంద రమేష్, రెడపంగి సైదులు, తాటికాయల బాబు, చింత జోసెఫ్, నీరటి కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 'జంగా'కు వరంగల్ పశ్చిమ టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ : డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని రఘునాథపల్లి ఎంపీపీ మేకల వరలక్ష్మీనరేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య డిమాండ్ చేశారు. జంగాకు టికెట్ రావడం లేదని సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు డివిజన్ కేంద్రంలో బుధవారం ప్రత్యేకంగా సమావేశయ్యారు. జంగా టికెట్ విషయమై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి, ఏడు మండలాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల నిరసన



స్టేషన్‌ఘన్‌పూర్ : తమకు సమ్మె కాలానికి (34 రోజులకు) సంబంధించి వేతనాలు చెల్లించాలని కోరుతూ ఘన్‌పూర్ గ్రామపంచాయతీ కార్మికులు బుధవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు బోసు రాజు, కుంభం రాజు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికులు జూలై, ఆగస్టు నెలల్లో చేపట్టిన సమ్మె కాలపు వేతనాలు ఇవ్వకుండా ఈఓ, సర్పంచ్ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన మండల సభలో సమ్మె కాలపు వేతనాలు ఇవ్వాలని తీర్మానం చేసినా ఈఓ, సర్పంచ్ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన వేతనాలు, పెండింగ్‌వేతనాలు ఇంతవరకూ అందించలేదని, వేతనాలు రాక దుర్భర జీవితాలు గడుపుతున్నామన్నారు. ఇప్పటికైనా డీపీఓ స్పందించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో మూకుమ్మడి సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్మికులు స్వామి, చంద్రమౌళి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాతకు పూజలు

బచ్చన్నపేట : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో నాల్గోవ రోజు బుధవారం దుర్గామాతకు చండీ అవతారంలో అలంకరించి పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చన పూజలను నిర్వహించారు.

**మహాలక్ష్మిదేవి అలంకరణలో..**

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గోవ రోజు చండిక అమ్మవారు మహాలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు .అమ్మవారికి చండి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిల్పూరు: పూజలో పాల్గొన్న భక్తులు

**మల్కాపూర్‌లో..**

చిల్పూరు : మండలంలోని మల్కాపూర్‌లో బుధవారం దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. పోలేపల్లి రంజిత్‌రెడ్డి–మాధవి, మాదిరెడ్డి యశ్వంత్‌రెడ్డి –ప్రవళిక, ఎడవెల్లి మణెమ్మ, ద్రాక్షపల్లి ప్రసాద్ –నవ్య, గుజ్జ శ్రీను–రజిత, ఊరడి సతీష్, మాదం శెట్టి సుకన్య, హరీష్,అలుగు అశోక్, అరుస్, రవీందర్ తదితరులు ఉన్నారు.

# మహిళల పెద్ద పండుగ బతుకమ్మ



సీజేఐటీలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



వేడుకలో కళాశాల విద్యార్థులు

జనగామ : మండలంలోని యశ్వంతాపూర్ క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. సాంప్రదాయ వస్త్రధారణలతో పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల డైరెక్టర్ డి.విజయపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సంప్రదాయ, ఆచారాలను భావితరాలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో బతుకమ్మ సంబురాలు నిర్వహించామన్నారు. అంతకు ముందు డిప్లొమా విద్యార్థినులు కోలాటంతో అలరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే మహిళల పెద్ద పండుగ బతుకమ్మ అని అన్నారు. తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలకు డైరెక్టర్ బహుమతులను అందించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఆచార్యులు సంతోష కుమారి, స్వర్ణ, సరితా, ఆమని, మాలతి, గీత, విద్యార్థినులు చందన, ప్రజ్ఞ, స్ఫూర్తి, భువన, రుద్రమ, శ్రావణి, దుర్గాభవాని, రచన, హిమబిందు, తేజశ్రీ, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

**బతుకమ్మ సంబురాలు**

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో బుధవారం వైద్యులు, సిబ్బంది బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఝాన్సీ, మమత, సీహెచ్‌ఓ జంగమ్మ, సూపర్‌వైజర్ అనురాధ, అన్నాంబిక, శ్వేత, లలిత, తిరుపతమ్మ, పలువురు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

**అనుచిత వ్యాఖ్యలు సరికాదు**

జనగామ : నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని పీఏసీఎస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు నిమ్మతి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పల్లాపై కొమ్మూరి చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోకల్, నాన్‌లోకల్ అనే అంశం విషయమే కాదన్నారు. జనగామ నియోజకవర్గానికి పేద్ద పాలేరుగా పని చేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలుసుకోమన్నారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి జనగామ ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.
ఆయన వెంట నాయకులు గొలుసుల ఎల్లయ్య, వార్డు సభ్యులు ఎండి ఇబ్రహీం, గోనెల సుధాకర్, సంకటి ఎల్లయ్య, సంకటి రాంమ్మూర్తి, కంతిరి రాజు, రాపోలు సోమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

**అసత్య ఆరోపణలు**

జనగామ రూరల్ : రాజకీయంగా గ్రామాభివృద్ధి చేస్తున్న తన భర్త వంగాల శంకర్‌పై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని మండలంలోని ఎర్రగొల్లపహాడ్ సర్పంచ్ వంగాల రేణుక బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కారోబార్ తన పద్ధతి మార్చుకోవాలని తెలిపినందుకు లేని పోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

**బీజేపీ నాయకుల ఇంటింటా ప్రచారం**

దేవరుప్పుల : మోదీ పాలనతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతోపాటు సీతారాపురంలో ఇంటింటికి బీజేపీ విస్తృత ప్రచారం చేపట్టారు. అనంతరం పెద్దమడూరులో దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

**సోమయ్య మృతి తీరని లోటు**

పాలకుర్తి : మండల కేంద్రానికి చెందిన సోమయ్య వామపక్ష రాజకీయాల్లో ఎంతో కష్ట పడి పని చేశారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న అన్నారు. బుధవారం పాలకుర్తిలో నిర్వహించిన సంస్మరణ సభకు మండల కార్యదర్శి మాచర్ల సారయ్య అధ్యక్షత వహించారు. సోమయ్య మృతికి పార్టీకి తీరని లోటని ఆయన సేవలను కొనియాడారు.

**విజయవంతం చేయాలి**

జఫర్‌గఢ్ : ఈ నెల 27న స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు అన్నం బ్రహ్మారెడ్డి, తీగల కర్ణాకర్ రావు, బానోత్ రాజేష్ నాయక్, గాదెపాక అయోధ్య, ఇల్లందుల శ్రీనివాస్ కోరారు. మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ సమావేశాలను బుధవారం నిర్వహించారు. సభకు సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు. ఈ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. ఈ సమావేశాల్లో వారు మాట్లాడుతూ.. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలన్నారు. నాయకులు కుల్లా మోహన్‌రావు, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, తాటికాయల వరుణ్‌తో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**'బీసీ బంధు'లో అన్యాయం**

కొడకండ్ల : మండలంలోని రంగాపురం గ్రామంలో బీసీ బంధు పథకంలో నిరుపేదలైన రజకులకు తీవ్ర అన్యాయం చేశారని రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఐతరాజు రాజు, మండల అధ్యక్షుడు రాపోలు సోమయ్య, రాపోలు వెంకన్న ఆరోపించారు. బుధవారం మండలకేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు అర్హులను ఎంపిక చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, అధికారులు స్పందించి నిరుపేద రజకులకు న్యాయం చేయాలని వారు కోరారు.

**ప్రవళిక మృతిపై కేటీఆర్ వ్యాఖ్యలు తగవు**

దేవరుప్పుల : నిరుద్యోగ సమస్యతో కలత చెంది ఆత్మహత్య చేసుకున్న ప్రవళిక ఘటనపై కేటీఆర్ వ్యాఖ్యలు తగవని వైఎస్సార్‌టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది శ్రీహరి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రవళిక ఆత్మహత్య విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాల్సింది పోయి ఎన్నికల్లో ఎక్కడ తమకు నష్టం వాటిల్లుతుందోననీ, మృతురాలి కుటుంబ సభ్యుల్ని మైమరపించి సమస్యను పక్కదారి పట్టించే దుశ్చర్యలను సమాజం పసిగడుతుందన్నారు.

**కరపత్రాల ఆవిష్కరణ**

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్లలో బుధవారం బీకేఎంయూ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభల కరపత్రాన్ని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నల్ల పెద్ద మైసయ్య, జిల్లా కార్యదర్శి జనార్దన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. నవంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు బీహార్‌లోని పాట్నాలో జరిగే జాతీయ మహాసభలకు మండలంలోని వ్యవసాయ, ఉపాధి హామీ కూలీలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరస్వామి, రాములు, రవి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**బండా ప్రకాశ్‌ను కలిసిన ముదిరాజ్‌లు**

స్టేషన్‌ఘన్‌పూర్ : ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ జన్మదినం సందర్భంగా ఘన్‌పూర్‌కు చెందిన ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, మత్స్య సొసైటీ చీఫ్ ప్రమోటర్ నీల రాజు, జిల్లా డైరెక్టర్ బూర్ల శంకర్ తదితరులు బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా బండా ప్రకాష్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

**ఆర్థికసాయం**

దేవరుప్పుల : మండల కేంద్రానికి చెందిన చింత వెంకటయ్య మృతి చెందగా, బాధిత కుటుంబానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు బుధవారం వేర్వేరుగా ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

**విరాళం**

జనగామ రూరల్ : మండలంలోని వెంకిర్యాలలో సర్వాయి పాపన్న విగ్రహ నిర్మాణానికి పెంబర్తి గ్రామానికి చెందిన కొండబోయిన రాజు బుధవారం రూ.5,000 విరాళాన్ని అందజేశారు. అశోక్, అంజయ్య, శివరాం, నరేందర్, మల్లేషం, పర్వయ్య, తదితరులు ఉన్నారు.

**సిగ్నల్ పోల్‌ను ఢీ కొట్టిన కలప లారీ**

జనగామ : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా ఫౌంటేయిన్ పక్కన ఉన్న సిగ్నల్ స్తంభాన్ని లారీ ఢీ కొట్టిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కలప లోడ్‌తో వెళ్తున్న లారీ, సిగ్నల్ పోల్‌ను ఢీకొట్టింది. దీంతో సిగ్నలింగ్ వ్యవస్థ స్తంభించింది.

**లేగదూడల పంపిణీ**

దేవరుప్పుల : రైతులు పశు సంపదను రక్షించుకోవాలని గోశాల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ సూచించారు. బుధవారం రాత్రి సీతారాంపురంలో భద్రకాళీ గోశాల ఆధ్వర్యంలో పలువురు రైతులకు లేగదూడలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బస్వ మల్లేషం, గోశాల మండల ప్రతినిధి ఆజ్మీరా రవి పాల్గొన్నారు.